హోం టుడే ఫర్నీచర్, హోమ్ నీడ్స్ రిక్లైనర్ మేళా షురూ



మేళాను ప్రారంభిస్తున్న వినియోగదారులు, నిర్వాహకులు

మూసాపేట: కూకట్‌పల్లి వై జంక్షన్ ది చెన్నై సిల్క్స్ ప్రాంగణంలో హోమ్ టుడే ఫర్నీచర్, హోమ్ నీడ్స్ రిక్లైనర్ మేళా గ్రాండ్‌ను కస్టమర్ల చేతుల మీదుగా సోమవారం ప్రారంభించారు. ప్రతి రిక్లెనైర్ కొనుగోలుపై 40 శాతం డిస్కౌంట్, ఒక టీపాయ్ ఉచితంగా ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బెస్ట్ క్వాలిటీ, బెస్ట్ డిజైన్స్ అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతి కొనుగోలుదారుడికి ఉచిత బహుమతి ఇస్తున్నామని పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో డీజీఎం రాజేంద్రన్, ఏజీఎం మహేశ్, మేనేజర్ త్యాగరాజన్ పాల్గొన్నారు.

నియామకం



సంతోష్ కుమార్

మూసాపేట: భరత్‌నగర్ కాలనీకి చెందిన సంతోష్‌కుమార్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు గంధం రాములు చేతుల మీదుగా సోమవారం ఆయన నియామకపత్రాన్ని అందుకున్నారు. అనంతరం సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రైవేట్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

పైపులైన్ పనుల పరిశీలన



చైతన్యబస్తీలో పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహేందర్

మూసాపేట: చైతన్య బస్తీలో చేపట్టిన తాగునీటి పైపులైన్ పనులను డివిజన్ కార్పొరేటర్ మహేందర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు ఇంటింటికీ కనెక్షన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మూసాపేట డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఎర్ర స్వామి, సీనియర్ నాయకులు మల్లేశ్‌గౌడ్, ఐలయ్య, రవికుమార్ గౌడ్, రమేశ్ నాయర్, క్రాంతికుమార్, బస్తీవాసులు పాల్గొన్నారు.

హోప్ ఆఫ్ హంగర్ ట్రస్ట్ సేవలు అభినందనీయం



మహిళలకు కుట్టుమిషన్, వీల్‌చైర్‌ను అందజేస్తున్న కార్పొరేటర్, ట్రస్ట్ ప్రతినిధులు

ఆల్విన్‌కాలనీ: హోప్ ఆఫ్ హంగర్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ అన్నారు. ఎల్లమ్మబండ, పీజేఆర్‌నగర్‌లో నివసిస్తున్న జెట్టి కంసమ్మ అనే నిరుపేద మహిళకు వీల్ చైర్, కుట్టు మిషన్ కుట్టు మిషన్‌ను ట్రస్ట్ సహకారంతో ఆయన సోమవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ధాతి రమేశ్, షకీల్ మున్నా, వాలి నాగేశ్వరరావు, సూరిబాబు, సంస్థ నిర్వాహకురాలు అలేఖ్య, వెంకటేశ్వరరావు, మల్లీశ్వరి, రవికిరణ్, అమూల్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



చెక్కును అందజేస్తున్న మేయర్ విజయలక్ష్మి, రమేశ్

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ నాలాలో గత నెలలో కొట్టుకుపోయి మృతి చెందిన షేక్ ముజ్మిల్ తల్లిదండ్రులకు సోమవారం ప్రభుత్వం ఆర్థిక సాయం అందించింది. జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేశ్‌తో కలిసి ముజ్మిల్ తల్లిదండ్రులు షేక్ హుస్సేన్, హలీంబేగంకు ఆమె కార్యాలయంలో రూ.2 లక్షల చెక్కును సోమవారం అందజేసింది. కార్యక్రమంలో లక్ష్మయ్య, అయాజ్, కుక్కల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డదిడ్డం..!

మోతీనగర్-బోరబండ వెళ్లే ప్రధాన రోడ్డులో అడ్డదిడ్డంగా ఉన్న సిమెంట్ దిమ్మెలు





- ప్రమాదకరంగా మోతీనగర్-బోరబండ ప్రధాన రోడ్డు
- రోడ్డుపై సక్రమంగా లేని సిమెంట్ దిమ్మెలు
- వాటికి ఢీకొని గాయాలపాలవుతున్న వాహనదారులు





మోతీనగర్: వాహనాలు సక్రమంగా, క్రమపద్ధతిలో వెళ్లడానికి రోడ్డు మధ్యలో డివైడర్లను ఏర్పాటు చేస్తారు. అయితే అవే క్రమపద్ధతిలో లేకపోవడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. మోతీనగర్ చౌరస్తా నుంచి బోరబండ రోడ్డు మధ్యలో స్నేహపురి కాలనీ కమాన్ నుంచి బోరబండ వరకు రహదారి మధ్యలోని సిమెంట్ దిమ్మెలు అడ్డదిడ్డంగా ఉండడంతో రాత్రివేళల్లో గమనించిన పలువురు వాహనదారులు వాటికి ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రోడ్డు హైటెక్ సిటీకి మార్గమధ్య దారి కావడంతో నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్డు మధ్యలోని సిమెంట్ దిమ్మెలను ఒక క్రమ పద్ధతిలో ఏర్పాటు చేసి ప్రమాదాల జరగకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

క్రమపద్ధతిలో ఏర్పాటు చేయాలి..



మోతీనగర్ నుంచి బోరబండ వరకు రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మెలు అడ్డదిడ్డంగా ఉన్నాయి. దీంతో రాత్రివేళల్లో గమనించని వాహనదారులు వాటికి ఢీకొని ప్రమాదాల బారినపడుతున్నారు. ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటోంది. అధికారులు సత్వరమే స్పందించి సిమెంట్ దిమ్మెలను క్రమ పద్ధతిలో ఏర్పాటు చేయాలి.

– అలెక్స్ థామస్, బోరబండ

వరద కాలువ పనుల పరిశీలన

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్ రోడ్డు, హోలిస్టిక్ హాస్పిటల్ వద్ద కొనసాగుతున్న వరద కాలువ పనులను హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ డీజీఎం నాగప్రియ, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వీరన్న, సీఐ జానయ్య, డివిజన్ వాసులు తదితరులు పాల్గొన్నారు.



వరద కాలువ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్, అధికారులు

కాంగ్రెస్‌తోనే సొంతింటి కల సాకారం



కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు సతీశ్ రెడ్డి

కూకట్‌పల్లి: పేద, మధ్య తరగతి వారికి తక్కువ ధరకే వాయిదాల పద్ధతిలో ఇళ్లు కేటాయించి సొంతింటి కల నెరవేర్చింది కాంగ్రెస్ ప్రభుత్వం అని కూకట్‌పల్లి నియోజకవర్గ ఆ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీశ్ రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల ఎమ్మెల్యే మాధవరం స్పందించిన తీరును ఆయన ఖండిస్తూ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిబంధనలు అతిక్రమించి నిర్మించిన వాటిపై చట్టం ప్రకారం అధికారులు చర్యలు తీసుకుంటే ఎమ్మెల్యేకు ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు. నాటి సీఎం చంద్రబాబు నాయుడు హయాంలో మలేషియన్ టౌన్‌షిప్ పేరిట నిర్మించిన ఐజేఎం సంస్థకు 37 ఎకరాలు కేటాయించింది నిజం కాదా..? అని ప్రశ్నించారు. ఆలయాలు, మసీదులు, చర్చిలకు ప్రభుత్వం అధికారికంగా స్థలాల కేటాయింపులు జరపదని, హౌసింగ్ బోర్డు స్థలం ప్రభుత్వం నిర్ణయించిన ధరకు నిబంధనల ప్రకారం కేటాయిస్తుందన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే మాధవరం తీరు మార్చుకోవాలని లేకుంటే రాజకీయ పుట్టగతులు ఉండవని పేర్కొన్నారు.

ఎంపీని కలిసిన నాయకులు

మోతీనగర్: మూసాపేట డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా నియమితులైన ఎర్ర స్వామి డివిజన్ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్, ముఖ్య నాయకులతో కలిసి ఎంపీ ఈటల రాజేందర్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈటల ఎర్ర స్వామిని శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మల్లేశ్ గౌడ్, పిట్ల మనోహర్, సద్గున రెడ్డి, ఐలయ్య యాదవ్, సతీశ్‌చారి, రమేశ్ నాయర్, బసవరాజు, రవిగౌడ్, కృష్ణ యాదవ్, శోభారాజన్, శ్రీకాంత్, వాసవి, లింగ, అబ్బాస్, బీజేవైఎం డివిజన్ అధ్యక్షులు ప్రశాంత్‌రెడ్డి, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ ఈటల రాజేందర్‌తో ఎర్రస్వామి, కార్పొరేటర్

ప్రజావాణికి 60 ఫిర్యాదులు



సాక్షి,సిటీబ్యూరో: వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలకు సంబంధించిన అర్జీలను డీఆర్‌ఓ హరిప్రియతో కలిసి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి స్వీకరించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో వివిధ సమస్యలకు సంబంధించి 60 ఫిర్యాదులు ప్రజావాణిలో అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. వివిధ శాఖలలో ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను పేర్కొంటూ.. ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ ఆయన చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

క్రిస్టియన్ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సతీశ్‌రెడ్డి తదితరులు

కూకట్‌పల్లి: తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ చొరవతో కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేశ్ పర్యవేక్షణలో కేపీహెచ్‌బీ కాలనీలో నూతనంగా క్రిస్టియన్ మైనార్టీ కార్యాలయాన్ని నిర్మించారు. కాగా కూకట్‌పల్లి నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు శేరి సతీశ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సోమవారం కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం క్రిస్టియన్ మైనార్టీ కోఆర్డినేటర్ క్రిష్టఫర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా సతీశ్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి డివిజన్‌లో క్రిస్టియన్ కమిటీలు నియమించి కాంగ్రెస్‌కు, క్రిస్టియన్ మైనార్టీకి వారధిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు హాసిటోచర్, జాన్, ఫణీంద్ర కుమార్, కేపీహెచ్‌బీ డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, ఆర్‌ఏపాల్, మయూరి, పొడుగు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



అరుణను శాలువాతో సన్మానించిన కార్పొరేటర్ వెంకటేశ్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ కాలనీకి చెందిన సీనియర్ నాయకురాలు సీ అరుణ రంగారెడ్డి జిల్లా నుంచి తెలంగాణ స్టేట్ మహిళా కాంగ్రెస్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్, యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ అరుణను సోమవారం శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మోజెస్, రాజ్యలక్ష్మి, సౌందర్య, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సమాజసేవలో లయన్స్ క్లబ్ ముందుంటుంది



లయన్ తుమ్మల శ్రీనివాస్, స్వర్ణలతను సన్మానిస్తున్న క్లబ్ ప్రతినిధులు

బాలానగర్: సమాజ సేవలో లయన్స్ క్లబ్ ఎప్పుడూ ముందుంటుందని రీజియన్ చైర్మన్ తుమ్మల శ్రీనివాస్, లయన్‌స్వర్ణలత అన్నారు. బాలానగర్‌లో సోమవారం జరిగిన క్లబ్ ప్రాంతీయ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా సేవ చేయడమే క్లబ్ ప్రధాన లక్ష్యమన్నారు. సదస్సులో ఉత్తమ సేవ కనబరిచిన వారికి మెమోంటోలు, శాలువాలతో సత్కరించారు. అలాగే పిల్లలు, పెద్దలు సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం లయన్ తుమ్మల శ్రీనివాస్, స్వర్ణలతను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో బాబురావు, డిస్ట్రిక్ట్ గవర్నర్ రాజేంద్రప్రసాద్, ఏరియా లీడర్ దీపక్ భట్టాచార్య, సుజిత్ కుమార్ ఝా, మోహన్ ప్రభాకరం, సాయిరాం, రాజు, శైలజ నాయర్, డాక్టర్ సుబ్రహ్మణ్యం, రాములు, అలోక్ కుమార్ ఝా, చేతన్ బాంట్యా, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

– జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



సాక్షి,సిటీబ్యూరో: ఈ నెల 26న గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా అధికారులు, పోలీసు అధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పోలీస్ గౌరవ వందన స్వీకరణ, బందోబస్తు ఏర్పాట్లతోసహా స్టేజ్, సీటింగ్, తాగునీరు, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సందేశ పుస్తకాన్ని నిర్దేశించిన సమయంలోపు రూపొందించాలన్నారు. పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రౌండ్‌లో మెడికల్ టీమ్‌తో ఎమర్జెన్సీ సేవలు, నిరంతరాయ విద్యుత్ సరఫరా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఉత్తమ సేవలందించిన ఉద్యోగులను గుర్తించి ఉత్తమ సేవా ప్రశంసా పత్రాల కోసం ప్రతిపాదనలు పంపాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్నా అత్యంత ప్రతిష్టాత్మకమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలియచేసే స్టాళ్ల ఏర్పాట్లకు సన్నద్ధంగా ఉండాలని సంబంధిత శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. జిల్లా అధికారులు సమన్వయంతో గణతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని ఆదేశించారు. జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు నిర్వహించే ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలలో ప్రోటోకాల్ నిబంధనలను జిల్లా అధికారులు ఖచ్చితంగా పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ రాములు, ఏఓ, జిల్లా శాఖల అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పరిహారం ఇవ్వాలి

మేడ్చల్: మేడ్చల్ పరిధిలోని 44వ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కండ్లకోయ నుంచి ఎల్లంపేట్ వరకు ఆస్తులు నష్టపోతున్న వారికి ప్రభుత్వం అధిక నష్టపరిహారం ఇవ్వాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మేడ్చల్‌లో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో నాయకుడు నందారెడ్డి, జగన్‌గౌడ్, పట్టణ అధ్యక్షురాలు శైలజ మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం వచ్చేలా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు ఇప్పటికే విన్నవించినట్లు నాయకులు తెలిపారు. విస్తరణలో పేదలు, రైతులు విలువైన స్థలాలు నష్టపోతున్నారన్నారు.

క్రీడాకారుల ఎంపికకు 23, 25 తేదీల్లో టోర్నమెంట్

సాక్షి,సిటీబ్యూరో: రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో 2024-25 రాష్ట్ర సివిల్ సర్వీసెస్ క్రీడాకారుల ఎంపిక కోసం ఈ నెల 23, 24వ తేదీల్లో ఆలిండియా సివిల్ సెర్వీసెస్ టోర్నమెంట్‌ను నగరంలోని జింఖానా గ్రౌండ్, ఎల్‌బీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి గోపాల్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రింద పేర్కొనబడిన క్రీడలు 1. అథ్లెటిక్స్ (స్త్రీ-పు), 2.క్రికెట్, 3.చెస్(స్త్రీ-పు) 4. క్యారమ్స్ (స్త్రీ-పు), 5. హాకీ (స్త్రీ-పు), 6. పవర్ లిఫ్టింగ్ (స్త్రీ-పు), 7.స్విమ్మింగ్ (స్త్రీ-పు), 8. టేబుల్ టెన్నిస్ (స్త్రీ-పు), 9.వాలిబాల్ (స్త్రీ-పు), 10. వెయిట్ లిఫ్టింగ్ (స్త్రీ-పు), 11.బెస్టు ఫిజిక్, 12.రెజ్లింగ్, 13. ఖోఖో, 14. యోగా ఎంపికలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి కలిగిన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు, 21న జిల్లా స్థాయి ఎంపికలకు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్నీ ఇతర వివరాలకు మేడ్చల్ కలెక్టరేట్‌లోని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఉచిత కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకోవాలి

సాక్షి,సిటీబ్యూరో: ఆర్‌ఆర్‌బీ, ఎస్‌ఎస్‌సీతోసహా బ్యాంకింగ్ రెక్యూట్మెంట్ (రిక్రూట్‌మెంట్) ఫౌండేషన్ కోర్సుకు ఉచిత కోచింగ్ కార్యక్రమాన్ని ఫిబ్రవరి 15 నుంచి రాష్ట్రంలోని 12 టీజీ బీసీ స్టడీ సర్కిళ్లలో నిర్వహిస్తున్నట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బీసీ అభివృద్ధిశాఖ అధికారి ఇందిర ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు మంగళవారం నుంచి ఫిబ్రవరి 9 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షల లోపు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల లోపు ఉండాలన్నారు. అభ్యర్థుల ఎంపిక విధానం రూల్ ఆఫ్ రిజర్వేషన్‌తో పాటు ఇంటర్మీడియట్, డిగ్రీ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటుందన్నారు. అర్హులైన అభ్యర్థులకు సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఫిబ్రవరి 12 నుంచి 14 వరకు ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 040-24071178 ఫోన్ నెంబర్ సంప్రదించాలని ఆమె సూచించారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ కార్మిక సంక్షేమ మండలి కింద అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో భాగంగా కార్మికుల పిల్లలు, కార్మికులు ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మేడ్చల్ ఏసీఎల్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉపకార వేతనాలు పొందేందుకు దుకాణాలు, వాణిజ్య సంస్థలు, మోటారు రవాణా సంస్థలు తదితర కార్మికులు అర్హులన్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో ఉతీర్ణులైన వారికి ప్రతిభ ఆధారంగా ఉపకార వేతనాలు అందించనున్నట్లు తెలిపారు. ఫారాలను కలెక్టరేట్‌లోని సంబంధిత జిల్లా సహాయ కార్మిక కమిషనర్ కార్యాలయంలో పొందవచ్చునన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఫిబ్రవరి 15 లోగా కార్మిక శాఖ కార్యాలయములో సమర్పించాలన్నారు. అసంపూర్తిగా ఉన్న లేక గడువు తరువాత సమర్పించబడిన దరఖాస్తులు తిరస్కరించబడుతాయన్నారు. ఎంపికైన అభ్యర్థులకు మేడే నాటికి ఉపకారవేతనాలను సంబంధిత సహాయ కమిషనర్లు లబ్దిదారుల బ్యాంకు ఖాతాలలో జమ చేస్తారన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే సకల సౌకర్యాలు



సీజ్ చేసిన వేణుగోపాల స్వామి ఆలయ మండపాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు



ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం,కార్పొరేటర్లు

- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీకాలనీ: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అనేక మౌలిక సదుపాయాలు కల్పించామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కేపీహెచ్‌బీకాలనీ వేణుగోపాల స్వామి ఆలయ మండపాన్ని హౌసింగ్ బోర్డు అధికారులు సీజ్ చేసిన విషయం తెలుసుకుని స్థానిక కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి సోమవారం ఆలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి కేటీఆర్ సహకారంతో కేపీహెచ్‌బీకాలనీలో మహిళా పార్కులు, చిల్డ్రన్స్ పార్కులు, ఆట స్థలాలు, క్రికెట్ గ్రౌండ్‌లను ఏర్పాటు చేశామన్నారు. అయితే ఇప్పుడు రేవంత్ రెడ్డి సర్కార్ హౌసింగ్ బోర్డు స్థలాలను అమ్మకానికి పెట్టడం దారుణమన్నారు. హౌసింగ్‌బోర్డు స్థలాల్లో ప్రజా ప్రయోజనార్థం 10 శాతం భూములను ఆలయాలు, పాఠశాలలు, పార్కులకు కేటాయించాలని, అలాంటివి ఏం లేకుండా వేలం ఎలా వేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తీరు మార్చుకోవాలని లేకుంటే ఈనెల 24న జరిగే వేలాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాబురావు, సతీశ్ అరోరా, డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, సాయిబాబా చౌదరి, శ్యామల రాజు, రాజేశ్, పవన్, సీఎల్. ప్రసాద్, సాయి పాల్గొన్నారు.

కాంగ్రెస్ దిమ్మెను తొలగించాలి

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీ రోడ్డు నంబర్-1లోని గాంధీ విగ్రహం వద్ద జాతీయ జెండా ఎగరవేయకుండా దిమ్మ పోల్‌ను జీహెచ్‌ఎంసీ అధికారులు తీసుకెళ్లారు. దాని పక్కనే ఉన్న కాంగ్రెస్ దిమ్మెకు జాతీయ జెండాను పెట్టడంతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సోమవారం అక్కడికి చేరుకుని జీహెచ్‌ఎంసీ అధికారుల తీరుపై మండిపడ్డారు. కాంగ్రెస్ దిమ్మెను తొలగించి పాత దిమ్మెకు జాతీయ జెండాను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ బాబురావు, సతీశ్ అరోరా, కృష్ణారెడ్డి, రాజేశ్ రాయ్, సాయి, గోపి, ఎర్రబెల్లి సతీశ్‌రావు, వెంకటేశ్ చౌదరి, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించండి

నియోజకవర్గంలో నెలకొన్న తాగునీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. ఈ మేరకు హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అండ్ సీవరేజ్ బోర్డు ఎండీ అశోక్‌రెడ్డిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలు ప్రాంతాల్లో తాగునీటిలో మురుగు నీరు కలిసి సరఫరా అవుతోందని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయమై కూకట్‌పల్లి డివిజన్ జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ నిధుల కొరతతో పనులు చేపట్టడం లేదన్నారు. అలాగే మిగిలిన పనులు కూడా పూర్తయ్యేలా నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, ముద్దం నరసింహ యాదవ్, పండాల సతీశ్ గౌడ్, సబిహా బేగం, మహేశ్వరీ శ్రీహరి, మాజీ కార్పొరేటర్లు తూము శ్రావణ్‌కుమార్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462